# వంచనాత్మక కళలో ఆరితేరిన దోపిడీ పాలకవర్గ పార్టీలు

## మరోసారి వెల్లడైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య బూటకత్వం

**పార్లమెంటు** బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటినుండీ అధికార, విపక్షపాలక పార్టీలన్నీ సరికొత్త నాటకానికి తెరలేపాయి. 2018–19 ఆర్థిక సంవత్సరానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టటంతో మొదలైన ఈనాటకం కొనసాగుతున్న తీరు, ప్రపంచంలో అతిపెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా పేర్కొంటున్న భారత శాసన వ్యవస్థ డొల్లతనాన్ని, వంచనాత్మక స్వభావాన్ని మరోసారి వెల్లడిచేస్తోంది.

గత ఏడు దశాబ్దాలుగా సాగుతున్న ఈ నాటకీయ బడ్జెట్ తంతు అంతా, దేశ–ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా సాగుతూవస్తున్నదే. సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ బూర్జువావర్గ ప్రయోజనాలకు కొమ్ముగాస్తూ వస్తున్నదే. అయితే, దీనినంతా కప్పిపుచ్చి, పేదప్రజల బడ్జెట్‌గా, శ్రామిక సంక్షేమ బడ్జెట్‌గా అధికారపక్షం ప్రస్తుతించుకోవటం, ప్రతిపక్షపార్టీలు పదాడంబరాలతో డాంబిక విమర్శలు గుప్పించటం, ప్రభుత్వానుకూల మేధావులు, మాధ్యమాలు 'ఈ బడ్జెట్ ప్రజల జీవితాలను సమూలంగా మార్చబోతోందం'టూ ప్రతి ఏడాదీ ఆకాశానికెత్తటం, వాస్తవానికి ప్రజల బతుకులు నానాటికీ దుర్భరంగా మారుతూ, దిగజారుతూ వుండటం....మనం చూస్తూ వస్తున్నదే! ప్రజలందరి అనుభవంలోనిదే!!

కనుక, ఈసారి కేంద్రబడ్జెట్‌కూడా ఇందుకు భిన్నమేమీకాదు. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014'లో పేర్కొన్న అంశాల అమలుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కేంద్రప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని, విభజన సమయంలో పార్లమెంటు వేదికగా నాటి ప్రధాని ఇచ్చిన 'ప్రత్యేక హోదా' హామీని నెరవేర్చకుండా నిరాకరిస్తోందని రాష్ట్రంలోని పాలక పార్టీలు, వామపక్షాలు గట్టిగా గొంతెత్తాయి. 'ప్రత్యేక హోదా' కు బదులుగా రాష్ట్రానికి ఇస్తామన్న 'ప్రత్యేక ప్యాకేజీ'కి సైతం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటాన్ని ఆక్షేపిస్తూ ఎన్‌డిఏలో భాగస్వామిగావున్న అధికార తెలుగుదేశం పార్టీకూడా వీరితో గొంతు కలిపింది. కేంద్రబడ్జెట్ కేటాయింపులలో వివక్షను నిరసిస్తూ ఫిబ్రవరి 8న వామపక్షాలు ఇచ్చిన 'ఆంధ్రప్రదేశ్ బంద్'కు బిజెపి మినహా తెలుగుదేశంతోసహా పాలకపార్టీలన్నీ మద్దతు తెలిపాయి. ఎడతెగని సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమౌతున్న ప్రజానీకపు అసంతృప్తి, అశాంతి, ఆగ్రహాల వ్యక్తీకరణగా బంద్ సంపూర్ణంగా జరిగింది.

ఆ తర్వాతనుండి రాష్ట్రంలో పాలకపార్టీల మధ్య 'ప్రత్యేక హోదా' సమరం ముమ్మరమైంది. గత నాలుగు సంవత్సరాలుగా ఎన్‌డిఏలో, కేంద్రమంత్రివర్గంలో భాగస్వామిగావున్న తెలుగుదేశం పార్టీ, కేంద్ర మంత్రివర్గం నుండి తొలుత వైదొలగింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామన్న బిజెపి ప్రభుత్వం, దానిని అమలుచేయలేదని, దాని స్థానంలో హోదా ప్రయోజనాలకు సమానమైన 'ప్యాకేజీ' ఆశచూపి, అది కూడా ఇవ్వకుండా రాష్ట్రప్రజలను మోసం చేశారంటూ తెలుగుదేశం అంగ లార్చింది. ఈ కాలంలోనే బిజెపి కేంద్ర, రాష్ట్ర నాయకులు రాష్ట్రప్రభుత్వంపై, చంద్రబాబుపై ఎక్కుపెట్టి తమ దాడిని తీవ్రంచేశారు. రాష్ట్రమంత్రివర్గం నుండి బిజెపికి చెందిన మంత్రులిరువురూ రాజీనామా చేశారు. అంతిమంగా మార్చి 16న ఎన్‌డిఏ నుండి టిడిపి వైదొలిగింది.

గత నాలుగేళ్లుగా రాష్ట్రముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్ళి విన్నవించుకున్నా, విభజన హామీల అమలుకు కేంద్రప్రభుత్వం నిధులివ్వక పోవటమనేది, తెలుగు వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీయటమేనంటూ భావోద్వేగాలను రేపుతున్నారు. పసిగుడ్డుగా వున్న విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసమే టిడిపి ఇంతకాలం ఎన్‌డిఏలో భాగస్వామిగా వుందనీ, ఆ ప్రయోజనాలకే విఘాతం కలగటంతో ఎన్‌డిఏని వీడి ప్రజల పక్షాన నిలిచామని టిడిపి నాయకులు ప్రకటిస్తున్నారు. కేంద్రంతో పోరాటానికి వెనుకంజవేయబోమని అసెంబ్లీ వేదికగా ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు. తమ ప్రత్యర్థి పక్షమైన వైసీపీని దగ్గరకు తీస్తూ, బిజెపి తమపై దాడిచేసి రాష్ట్రాన్ని అస్థిరపరిచి గుప్పెటపెట్టుకోవాలని చూస్తోందని, దీనిని సాగనీయబోమంటూనే, తనపై దాడిని ఆంధ్రప్రజలపై దాడిగా అభివర్ణిస్తూ శాసనసభలో చంద్రబాబు కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ సానుభూతి పొందాలని చూస్తున్నాడు. కేంద్రప్రభుత్వ సహాయనిరాకరణ కారణంగానే అమరావతి, పోలవరాలను శరవేగంగా అభివృద్ధిచేయలేక పోయానని పేర్కొంటున్నాడు.

రాష్ట్ర ఎన్నికలకు ఏడాదిన్నర ముందుగానే 'ప్రజా సంకల్పయాత్ర' పేరుతో, 'నవరత్నాల'తో (అందులో 'ప్రత్యేక హోదా సాధన' లేదు) మూడువేల కిలోమీటర్ల పాదయాత్రను వైసీపీ అధినేత జగన్ ప్రారంభించి, కొనసాగిస్తున్నాడు. నాలుగేళ్ళు మిన్నకుండి, ఇపుడు మరలా 'యు'టర్న్ తీసుకొని ప్రత్యేక హోదా గురించి చంద్రబాబు మాట్లాడటమే గొప్ప మోసకారీతనమని, ప్రత్యేకహోదాపై పేటెంట్ తమదేనని వైసీపీ చాటుకుంటోంది. ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేసిందని, ఆనాటినుండే ప్రత్యేకహోదాపై గట్టిగా నిలబడివుంటే, ఈపాటికి 'హోదా' సాధించుకోగలిగే వారమని చంద్రబాబుపై జగన్ నిప్పులు చెరగుతున్నాడు. అయితే, తన భవిష్యత్ రాజకీయ ప్రయోజనాలకోసం, ప్రత్యేకహోదా కల్పించని కేంద్ర ప్రభుత్వంతో సుతిమెత్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రత్యేకహోదా కోసం కేంద్రప్రభుత్వంపై ఆరుగురు సభ్యులతో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తున్న తమకు బిజెపీతో లాలూచీ వుండటమెలా సాధ్యమంటూ అదరగండంగా ప్రశ్నిస్తున్నాడు.

బిజెపి చేసిన వరుస ద్రోహాలంటూ ఏకరువు పెడ్తోన్న తెలుగుదేశం పార్టీ, తమ ఎన్నికల వాగ్దానాల అమలులో వైఫల్యాలన్నింటినీ

ఇతరుల పైకి నెట్టివేసి చేతులు దులుపుకోదలచుకుంది. ప్రత్యేకహోదా–ప్రత్యేక ప్యాకేజీ నుండి తిరిగి ప్రత్యేకహోదా పల్లవి నెత్తుకోవల్సి రావటంతో రాజకీయంగా ఇరుకునపడ్డ టిడిపి, పార్లమెంటులో కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి తామూ సై అంది.

ఈవిధంగా వైసీపీ, టిడిపీ, వీరికి తోడుగా కాంగ్రెస్, ఇతర విపక్షపార్టీలు కూడా క్రమంగా అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనకు తోడయ్యాయి. మార్చి 15 నుండి ప్రతిరోజూ కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చకై స్పీకరుకు వరుసగా నోటీసులు అందజేస్తూనే వున్నారు. ప్రతిరోజూ సభ ప్రారంభం కాగానే, ఏఐడిఎంకె సభ్యులు కావేరీ జలాల సమస్యపై(కొద్దిరోజుల క్రితం వరకు టిఆర్ఎస్ సభ్యులు రిజర్వేషన్ల అంశమై) తమకు మద్దతుగా ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతూ 'వెల్'లోకి వచ్చి నినాదాలు చేస్తూ వస్తున్నారు. అవిశ్వాస తీర్మానం చేపట్టటానికి అవసరమైన సభ్యుల సంఖ్యను లెక్కించటం సాధ్యంకానిదేమీ కాదని చిన్నపిల్లలకు సైతం అర్థమౌతున్నా, 'వెల్'లో గందరగోళాన్ని స్పీకర్ సాకుగా చూపుతూ వస్తోంది. నోటీసులను పరిగణలోకి తీసుకోకుండా, చర్చ చేపట్టకుండా సభ ప్రారంభమైన ఐదు నిముషాలకే ప్రతిరోజూ సభను వాయిదావేస్తూ రావటం దేశ ప్రజానీక మంతా చూస్తూనే వున్నారు. పార్లమెంటు సమావేశాలు జరిగినంతకాలం అవిశ్వాస తీర్మానం ఇస్తూనే వుంటామని, సభ నిరవధికంగా వాయిదా పడిన వెనువెంటనే తమ పార్టీ సభ్యులు ఆరుగురు లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేసి, ఢిల్లీలోని ఏపిభవన్‌కు ప్రదర్శనగా వెళ్ళి, అక్కడే నిరసన దీక్ష చేపడతారని వైసీపీ ప్రకటించింది. తెలుగుదేశం ఎంపిలు కూడా కలసి రావాలని పిలుపునిస్తూ రాజకీయంగా పైచేయిలో వుండేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది.

ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజలమధ్య, ప్రాంతాలమధ్య నిరంతరం తగువులు రగులుకునేలా, అస్పష్టతలతో ఆదరాబాదరాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రత్యేకహోదా గురించి చట్టంలో చేర్చకుండా ప్రధాని హామీకే పరిమితంచేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే, ఏపికి ప్రత్యేకహోదా కల్పిస్తా మంటూ కాంగ్రెస్‌పార్టీ మరోసారి నమ్మింప జూస్తోంది. ప్రత్యేకహోదా కల్పించని బిజెపి ప్రభుత్వంపై అవిశ్వాసానికి తానూ సిద్ధమంటూ వంచనాత్మక రాజకీయ క్రీడ సాగిస్తోంది.

2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర రాజకీయ రంగంలో ఆరంగేట్రం చేసిన సినీనటుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, ఆ సంవత్సరమే జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బాబు–మోడీ జోడీకి మద్దతుగా నిల్చింది. ప్రజాప్రయోజనమే గీటురాయిగా వీరికి మద్దతు తెలిపామని, అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలుచేయకున్నా, మాటతప్పినా వారిని ప్రశ్నిస్తామని, నిలదీస్తామని గొప్పగా చెప్పుకుంది. గత నాలుగు సం॥లుగా ప్రకటనలు, ప్రాంతీయ సదస్సులు, కొన్ని ప్రాంతాల సందర్శనలకే 'జనసేన' పరిమితమైంది. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యపైగానీ, తాను మద్దతిచ్చిన టిడిపి, బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైగానీ ప్రజల్ని కదిలించటం అలా వుంచి – కనీసం గట్టిగా గొంతే విప్పలేకపోయింది. ఇప్పుడే కళ్ళుదెరిచినట్లుగా, కేంద్ర – రాష్ట్రప్రభుత్వాల ప్రకటనలలో నిధుల విషయంలో పొంతన లేదు గనుక, తన ఆధ్వర్యంలో ఓ సంయుక్త నిజనిర్ధారణ కమిటి(జెఎఫ్‌సి)ని నియమించి గణాంకాల మతలబులతో కొన్నిరోజులు కుస్తీపట్టింది. మార్చి ఒకటో తేదీన మంగళగిరివద్ద జనసేన ఆవిర్భావ సభ జరిపి రానున్న ఎన్నికలలో తమ తడాఖా చూపుతామని ప్రకటించింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు –తనయుడు లోకేష్‌ల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవినీతి, అక్రమార్జనల అడ్డాగా గణుతికెక్కిందని గాండ్రించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన జగన్ నాయకత్వం లోని వైసీపీ ప్రత్యేకహోదాకోసం నిజాయితీగా పోరాటం చేయలేదని తీర్మానించింది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించని కేంద్రప్రభుత్వంతో పోరాడుతామని, ప్రత్యేకహోదా సాధనే లక్ష్యంగా త్వరలో తాను ఆమరణదీక్ష చేబడతానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించాడు. ప్రత్యేక హోదా సాధనకై వామపక్షాలతో కలసి కార్యాచరణ రూపొందిస్తానన్నాడు.

ప్రత్యేకహోదా సాధన సమితి, జనసేనలతో కలసి మార్చి 22వ తేదీన రెండుగంటలపాటు జాతీయ రహదారుల దిగ్బంధానికి వామపక్షాలు పిలుపునిచ్చాయి. హోదా అంశంపై ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూవచ్చాయి. జాతీయ రహదారుల దిగ్బంధం రోజునే తెలుగుదేశం శ్రేణులు విడిగా ప్రదర్శనలు నిర్వహించారు. మార్చి 27వ తేదీన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. బిజెపి, వైసిపి, జనసేన ఈ సమావేశానికి హాజరు కాలేదు. నల్ల బ్యాడ్జీలు ధరించి రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలనే జపాన్ తరహా ఆందోళనా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకటించాడు. 'ప్రత్యేకహోదా' ఆందోళనాకారులపై గత నాలుగు సం॥ల కాలంలో పోలీసులు పెట్టిన కేసులను ఎత్తి వేయాలని హోదా సాధన సమితి కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలిస్తా మన్నాడు. విభజనచట్టం, విభజన హామీల అమలుపట్ల కేంద్రప్రభుత్వ వైఖరిని గణాంకాలతో ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించాడు. ఎన్‌డిఏ నుండి బయటకు రావటంలో ఆలస్యం చేసి టిడిపి తప్పుచేసిందని వామపక్షాలు అభిప్రాయం వ్యక్తంచేశాయి. ప్రత్యేకహోదా కోసం ఉద్యమించని వారు ద్రోహులుగా మిగిలి పోతారని సిపిఐ దూకుడుగా వ్యాఖ్యానించింది.

మొత్తంమీద, గత రెండు నెలలుగా పార్లమెంటులోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ వామపక్షాలతోసహా పాలక, ప్రతిపక్షాలన్నింటి ఏకైక ఎజెండా 'ప్రత్యేకహోదా సాధన'గా మారిపోయింది. టీవీలలో చర్చా వేదికలు రణ రంగాలను తలపిస్తున్నాయి. ఏకకాలంలో టిడిపి, బిజెపి, వైసిపి, జనసేన, కాంగ్రెస్ తదితర పార్టీల, రాజకీయ విశ్లేషకుల పరస్పర ఆరోపణలు, దూషణలు, శాపనార్థాలతో టీవీలు దద్దరిల్లు తున్నాయి. ఇదంతా కొందరికి రాజకీయాలు 'రసవత్తరంగా' మారిపోవటంలాగా, ఎన్నికలకు చాలా ముందుగానే వాతావరణం 'రక్తికట్టటం' లాగా తోస్తోంది. ప్రచార సాధనాలు, సామాజిక మాధ్యమాలు ప్రత్యేకహోదా చుట్టూ ఎన్నో విశ్లేషణలు, కథనాలను మసాలా దట్టించి మరీ ప్రసారం చేస్తున్నాయి. పార్లమెంటులో ఈరోజు ఏం జరగబోతోంది? అవిశ్వాస తీర్మానం

చర్చకు వస్తుందా,రాదా? చర్చకు వస్తే ఓటింగ్ జరుగుతుందా? పార్లమెంటులో వివిధ పార్టీల బలాబలాలు ఎలా వున్నాయి? అవిశ్వాస తీర్మానంపై చర్చకు బిజెపి జంకుతోందా? చర్చ జరిగితే తన వైఫల్యాలు వెల్లడవుతాయని భావిస్తోందా? బిజెపిలోని అసమ్మతివర్గం, ఎన్‌డిఏలోని ఇతర భాగస్వామ్య పార్టీల గురించి బిజెపి ఆందోళన చెందుతోందా? వంటి మరెన్నో ప్రశ్నలను సంధిస్తూ ఏరోజు కారోజు సస్పెన్స్ థ్రిల్లర్‌ను మరిపించే రీతిలో పాలకపార్టీలన్నీ కలిసికట్టుగా వంచనాత్మక రాజకీయాలను అప్రతిహతంగా నడిపిస్తున్నాయి.

**పార్లమెంటులో ఒకవైపు ఈ రగడ జరుగుతుండగానే, ప్రజావ్యతిరేక కేంద్రబడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లులు చర్చకు కూడా నోచుకో కుండానే పార్లమెంటు ఆమోదం పొందాయి. దేశంలో, రాష్ట్రాలలో రైతాంగం, కార్మికుల జీవన్మరణ సమస్యలేవీ చర్చనీయాంశాలు కాకుండాపోయాయి. వేలకోట్ల రూ॥ ప్రజాధనాన్ని బ్యాంకులనుండి లూటీ చేసుకొని బడా వ్యాపారులు ఎంచక్కా విదేశాలకు చెక్కేయ గలుగుతున్నా, పార్లమెంటుకేమీ పట్టలేదు. విస్తరిస్తున్న సంక్షోభంతో కోరలు చాస్తోన్న నిరుద్యోగ సమస్యకు బలవుతున్న యువత గురించి చట్టసభలలో చర్చకు చోటులేకుండా పోయింది. 'ఖప్' పంచాయితీల పేరిట మధ్య యుగాలనాటి ఆటవిక పాలన యువతీ యువకులను బలిగొంటున్నా, కూతవేటు దూరంలోని ఢిల్లీ పాలకులకు అవేమీ పట్టలేదు. దళితులపై, మహిళలపై అత్యాచారాలు; మత మైనారిటీలపై హిందూత్వవాదుల దౌర్జన్యాలు, హింసాకాండల గురించి వీరికి పట్టలేదు. అన్నిటినీ మించి దేశసంపదను విచ్చలవిడిగా కొల్లగొట్టుకెళుతున్న సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కనుగుణమైన నిర్ణయా లన్నీ ఈ పార్లమెంటులో జరిగే ఈ రణగొణల నడుమ నుండే దర్జాగా, సునాయాసంగా చట్టాలుగా మారిపోవటమే వీరు కోరుకునేది!**

దోపిడీ పాలకవర్గ పార్టీలన్నింటికీ తెలిసి జరుగుతున్న నాటకమిది. దోపిడీవర్గ ప్రయోజనాలను పరిరక్షించటంలో వీరందరి మధ్య అప్రకటిత ఏకాభిప్రాయం వుంది. దోపిడీవర్గ వ్యతిరేక ప్రజాఉద్యమాలను, నిరసన గొంతులను అణచటంతో వీరందరి నడుమ సదవగాహన, సహకారం వ్యక్తమౌతుంది. అయితే దోపిడీ సంపదలో తమతమ వాటాలకోసం, వాటాలు పొందేందుకు అనువైన రాజకీయ అధికారంకోసం అవి కాట్లాడుకుంటూనే ఇదంతా ప్రజల ప్రయోజనాలు నెరవేర్చటం కోసమేనని ప్రజలకు భ్రమలు గొలిపే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్ర పరిధినుండి ప్రజల దృష్టి మరలిపోకుండా, దోపిడీకి కాపుగాసే ఈ చట్ట సభల డొల్లతనాన్ని పూర్తిగా బట్టబయలు కానీయకుండా జాగ్రత్త వహిస్తూ వున్నాయి.

పాలకవర్గాలు ఉద్దేశ్యపూర్వకంగా ఈ క్రీడలోకి అందరినీ లాగే ప్రయత్నం చేస్తున్నాయి. సంకల్పితంగానో, యాదృచ్ఛికంగానో ప్రజా స్వామికవాదులు, కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు విప్లవకారులు ఇందులో పావులు కారాదు. ప్రత్యేకహోదాను సర్వరోగ నివారిణిగా చూపెట్టి ఉద్వేగపూరితం చేసే ఉపన్యాసాలు సామాన్య ప్రజల చెవికెక్కుతున్నాయనుకోవద్దు. ప్రజలు ఈ నాటకాలనన్నీ గమనిస్తూనే వున్నారు. ప్రజలను భూమిసమస్య, అణచివేత, వివక్షల సమస్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీలకు సంబంధించిన సమస్యలనుండి ప్రక్కకు మళ్ళించే పాలకుల ఎత్తుగడలను ప్రజలు ఎప్పటికప్పుడు ఎరుకతో, చైతన్యంతో, సమర్ధవంతంగా తిప్పికొట్టే రోజురాకపోదు. ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న-రైతాంగానికి గిట్టుబాటుధరలు, భూపరాయీకరణ, పెద్దఎత్తున సాగుతున్న కూలీల వలసలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెరుగుతోన్న నిరుద్యోగం, నిజ వేతనాల కుదింపు, గగన కుసుమాలవుతున్న విద్య-వైద్యంవంటి సమస్యలపై పాలకుల మెడలు వంచే ఉద్యమాలలోకి సమీకృతం కావాలి.

**4-4-18**

ooooo